# లంబడి తండా గ్రామపంచాయతీలో మహిళా సభ విజయవంతం..

### అక్రమ మద్యం, గుడుంబ, బెల్ట్ షాపులు, గంజాయి అమ్మినవారికి ప్రభుత్వ పథకాలు నిషేధం కీలక తీర్మానం,






**బెల్లంపల్లి, ప్రతినిధి జూన్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలో లంబడి తండా గ్రామపంచాయతీలో మహిళా సభ గ్రామ సర్పంచ్ సాగర్ల లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై గ్రామ అభివృద్ధి, సామాజిక సమస్యలపై చర్చించారు. ఈ మహిళా సభలో గ్రామంలో గుడుంబా తయారీ, బెల్ట్ షాపుల నిర్వహణ, గంజాయి సేవించడం లేదా విక్రయించడం వంటి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టాలని సభ్యులు తీర్మానం చేశారు. గ్రామంలో ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను నిలిపివేయాలని మహిళా సభలో తీర్మానం చేసినట్లు తెలిపారు. గ్రామాన్ని మత్తు పదార్థాలు లేని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు మహిళలందరూ కలిసి కృషి చేయాలనిపిలుపునిచ్చారు. గ్రామంలో తడి పొడి చెత్తను వేరుగా చేసి సేకరించాలని, ప్లాస్టిక్ రహిత గ్రామపంచాయతీగా మారాలని ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సాగర్ల లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాంటేంకి శిరీష, వార్డు సభ్యులు కందుల వసుంధర, అజ్మీర సునీత, రంగ శ్రీలత, దబ్బిటి వేణుగోపాల్, సామాజిక కార్యకర్త రంగ ప్రశాంత్, పట్టి సతీష్ బాబు, మహేష్, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అనిల్ కుమార్ సేవలు చిరస్మరణీయం: ఆకుల గాంధీ

### ● ఉద్యోగ విరమణ సందర్భంగా ఘన సత్కారం





**ఖమ్మం, ప్రతినిధి జూన్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారత జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ఖమ్మం శాఖలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన అనిల్ కుమార్‌ను లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ సమాఖ్య (ఎల్ఐఏఏఎఫ్ఐ) మాజీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఆకుల గాంధీ ఘనంగా సత్కరించారు. ఎల్ఐసీ కార్యాలయంలోని ఎంప్లాయిస్ క్లబ్ రూంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అనిల్ కుమార్‌కు శాలువా కప్పి సన్మానించిన ఆకుల గాంధీ, సంస్థ అభివృద్ధికి ఆయన అందించిన సేవలు, చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. అనిల్ కుమార్ తనకు సన్నిహిత మిత్రుడని, ఆత్మీయుడని పేర్కొంటూ ఆయన భవిష్యత్ జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ బాలాజీ నాయక్‌తో పాటు లింగయ్య, వనిత, భద్రయ్య, రామలింగం, సురేష్, మధుసూదన్, హనుమంతరావు, శ్రీనివాసరావు, చక్రపాణి, వీరయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా నిలిచిన టీడీపీ కుటుంబం

### గాయపడిన కార్యకర్తను పరామర్శించిన డాక్టర్ పొగాకు జయరాం చందర్

### ఫోన్‌లో మాట్లాడి భరోసా నింపిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు






**ఖమ్మం ప్రతినిధి, జూన్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాజకీయాలు కేవలం పదవులకే పరిమితం కావని, కార్యకర్తల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడమే నిజమైన నాయకత్వమని తెలుగుదేశం పార్టీ నాయకులు మరోసారి చాటిచెప్పారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి ఖమ్మం మమత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పార్టీ అభిమాని బాసాని నాగేశ్వరరావును పరామర్శించి ఆయన కుటుంబానికి ధైర్యం నింపారు. ఇల్లందు నియోజకవర్గంలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన బాసాని నాగేశ్వరరావు గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర తెలుగు యువత మాజీ అధ్యక్షుడు డా. పొగాకు జయరాం చందర్ హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా ఖమ్మంకు చేరుకుని ఆసుపత్రిలో పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారితో ఫోన్‌లో మాట్లాడించి, బాధితుడికి ఆత్మస్థైర్యాన్ని నింపారు. నాగేశ్వరరావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన చంద్రబాబు, పార్టీ కుటుంబం ఎల్లప్పుడూ తమ కార్యకర్తలకు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఆపదలో ఉన్న వ్యక్తిని పలకరించే ఆప్యాయత, బాధలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచే మనసే నిజమైన రాజకీయ సంస్కృతికి ప్రతీక అని స్థానిక నాయకులు పేర్కొన్నారు. ఈ పరామర్శ బాధిత కుటుంబానికి కొత్త ధైర్యాన్ని, ఆశను నింపిందని వారు తెలిపారు. అనంతరం ఖమ్మం జిల్లా టీడీపీ నాయకులు కొండబాల కరుణాకర్, కేతినేని హరీష్, ముద్రగడ వంశీ, వనమ వాసు, లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు, రాయల కోటేశ్వరరావు, పరిటాల నాగార్జున, యలమంచి శివ చౌదరి, అన్వేష్, చందు తదితరులు నాగేశ్వరరావును పరామర్శించి, ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియపై ఓటర్లకు అవగాహన కార్యక్రమం...






**కరీంనగర్ టౌన్ జూన్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియపై ఓటర్లకు అవగాహన కల్పించేందుకు మస్జిద్-ఎ-సలాం అల్ ఖమీసీ అధ్యక్షులు సయ్యద్ నజముద్దీన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 61వ డివిజన్ కార్పొరేటర్, ఏఐఎంఐఎం కరీంనగర్ జాయింట్ సెక్రటరీ మహమ్మద్ అతీఫ్ (అతీనా), 60వ డివిజన్ కో-కార్పొరేటర్ సయ్యద్ ఇబ్రహీం, 44వ డివిజన్ కో-కార్పొరేటర్ బుచ్చి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పూరించే విధానం, అవసరమైన పత్రాలు, దరఖాస్తు సమర్పణ ప్రక్రియను వివరించి, వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొని తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# భవన నిర్మాణ కార్మిక సమస్యలు పరిష్కరించాలి...

### పెన్షన్ 6000 రూపాయలు ఇవ్వాలి.....

### వెల్ఫేర్ బోర్డు లో పెండింగ్ ఉన్న దరఖాస్తులను పరిష్కారం చేయాలి....

### సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్రావు




**పెనుబల్లి, జూన్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మార్వో కార్యాలయం ముందు సిఐటియు పెనుబల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రంను ఎమ్మార్వో వీరభద్ర నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విటలరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్ లో ఉన్న వెల్ఫేర్ బోర్డు దరఖాస్తులను తక్షణమే పరిష్కారం చేయాలని, ఇల్లు లేని నిరుపేదలైన భవన నిర్మాణ కార్మికులకు ఇల్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. 55 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులకు 6 వేలు పెన్షన్స్ సౌకర్యాన్ని కల్పించాలని, అన్నారు. గత శాసనసభ సమావేశాల్లో నిర్ణయించిన ప్రకారం భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిల్ ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మికులకు పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గాయం తిరపతి రావు, రైతు సంఘం మండలాధ్యక్షుడు చిట్టి మొదల కృష్ణయ్య, సిఐటియు మండల కన్వీనర్ గుడిమెట్ల బాబు, చీపి వెంకటేశ్వరరావు, చందు, జి వెంకటేశ్వరావు, చెన్నారావు, గోపి, శీను, తడకమల్ల చిరంజీవి, కంటే సత్యం, తదితరులు పాల్గొన్నారు.

# జూలై 15 నాటికి సీతారామ ప్రాజెక్టు ద్వారా నీటి విడుదల చేయాలి

### ● తెలంగాణ రైతు సంఘం డిమాండ్



**తల్లాడ, జూన్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జులై 15వ తేదీ నాటికి సీతారామ ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం తల్లాడ మండల కమిటీ ఆధ్వర్యంలో నీటిపారుదల శాఖ అధికారికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం డివిజన్ అధ్యక్షుడు నల్లమోతు మోహన్‌రావు మాట్లాడుతూ, తల్లాడ మండలానికి సీతారామ ప్రాజెక్టు కాలువ ద్వారా నీరు అందిస్తే సుమారు 20 వేల ఎకరాల ఆయకట్టుకు రెండు పంటలు సాగు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నా గోదావరి జలాలు అందడం వల్ల రైతులు పంటలను భద్రంగా సాగు చేసి, వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని అన్నారు. సంబంధిత శాఖ అధికారులు నీటి విడుదల తేదీని వెంటనే ప్రకటించి, వరి సాగుపై రైతుల్లో ఉన్న సందిగ్ధతను తొలగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, మల్లారం మాజీ ఉపసర్పంచ్ అయినాల రామలింగేశ్వరరావు, పులి కృష్ణయ్య, పులి వెంకట నరసయ్య, భూమా శ్రీనివాసరావు, ఆలస్యం బుచ్చయ్య, ఆలస్యం విజయ్, రావూరి అప్పారావు, అద్దంకి ఏసు, వేల్పుల కృష్ణయ్య, కారుమంచి వెంకటి తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణపై సబ్-కలెక్టర్ అజయ్ యాదవ్ ఆకస్మిక తనిఖీ



### డిజిటైజేషన్‌లో పొరపాట్లకు తావులేకుండా పని చేయాలని అధికారులకు ఆదేశాలు



**కల్లూరు, జూన్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంను పకడ్బందీగా అమలు చేయాలని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కల్లూరు మండలంలోని పోలింగ్ స్టేషన్ నెం.108, పెనుబల్లి మండలంలోని పోలింగ్ స్టేషన్ నెం.132లను ఆయన ఆకస్మికంగా సందర్శించి, ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిజిటైజేషన్ పనుల పురోగతి, నమోదు వివరాల ఖచ్చితత్వం, డేటా ఎంట్రీ నాణ్యతను నిశితంగా పరిశీలించిన సబ్ కలెక్టర్ ప్రతి ఫారాన్ని పూర్తిస్థాయిలో ధృవీకరించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా డిజిటైజ్ చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిర్దేశిత గడువులోగా డిజిటైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయడంతో పాటు, ఓటర్ల వివరాలను అత్యంత జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. చిన్న పొరపాటు కూడా ఓటర్ల హక్కులను ప్రభావితం చేసే అవకాశం ఉన్నందున ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని సిబ్బందికి తెలిపారు. ఈ తనిఖీలో ఆర్ఐ ప్రసన్న, అధికారులు, మున్సిపాలిటీ కౌన్సిలర్ సయ్యద్ రేష్మ ఇంతియాజ్ పాల్గొన్నారు.

# ఘనంగా పంచాయతీ రాజ్ శాఖ ఎస్.ఈ భోనగిరి గిరీష్ బాబు పదవీ విరమణ కార్యక్రమం...



**కరీంనగర్ జూన్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):** పంచాయతీ రాజ్ శాఖలో సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా సుదీర్ఘకాలం పాటు విశేష సేవలందించిన భోనగిరి గిరీష్ బాబు పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా మంగళవారం రోజున కరీంనగర్లోని ఎస్ బి ఎస్ ఫంక్షన్ హాల్లో ఆయనకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు గిరీష్ బాబు వృత్తిలో చూపిన అంకితభావం, నిజాయితీ, నిస్వార్థ సేవలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా గుర్తుచేసుకున్నారు. గిరీష్ బాబు కఠోర శ్రమ, నిబద్ధత.. సహోద్యోగులతో పాటు ప్రజల మన్ననలను, గౌరవాన్ని పొందేలా చేశాయని కొనియాడారు. అధికారిక విధుల నుంచి ఆయన పదవీ విరమణ పొందినప్పటికీ, ఆయన అందరికీ పంచిన ప్రేమ, గౌరవం, స్ఫూర్తి ఎప్పటికీ నిలిచిపోతాయని సన్మాన పత్రంలో పేర్కొన్నారు. జీవితంలో ప్రారంభం కాబోయే ఈ కొత్త అధ్యాయం.. ఆయనకు మరియు వారి కుటుంబానికి ఆయురారోగ్యాలను, అంతులేని ఆనందాన్ని, ప్రశాంతతను అందించాలని ఆకాంక్షించారు.

